


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 13 సంచిక : 1 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :1 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 4 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

- ఎస్ఐఆర్ గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలి
- ఐడీ కార్డుల పంపిణీతో కార్యకర్తలను మరింత క్రియాశీలం చేయాలి
- గ్రామస్థాయి నుంచి ఎన్నికల సన్నద్ధతకు పటిష్ట ప్రణాళిక
- వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

- మిగతా 2లో




## పాలన పక్కనపెట్టి ఈవెంట్ మేనేజ్‌మెంట్

### చంద్రబాబుపై గుడివాడ అమర్నాథ్ విమర్శలు

- పోలవరం పనులు పూర్తయినట్టు ప్రజలను మోసం చేస్తున్నారన్న గుడివాడ
- నీటిని పంప్ చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శ
- నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఆరోపణ

- మిగతా 2లో






## మోదీని అడిగే దమ్ముందా?..

### తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో



## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..

### రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు

పెన్ పవర్ డెస్క్:సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమ య్యను ఆదాయానికి మించి ఆస్తులు కూడ బెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన అధికారులు.. ఆయన

- మిగతా 2లో

## వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు

# నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం

- జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వడం లేదంటూ వైకాపా తప్పుడు ప్రచారం
- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ నీటి విడుదలపై దుష్ప్రచారం
- ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులకు సీఎం ఆదేశం
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సూచన
- నిత్యావసర ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపే పూర్తి చేయాలని సూచన
- కోర్టు సమస్యలున్న 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు



పెన్ పవర్ డెస్క్: జలాశయాల్లో నీళ్లున్నా పంట లకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జఠిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కారించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో

గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.

స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను


- మిగతా 2లో



## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

- దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ
- గంగిరెడ్డి, శివశంకర్ రెడ్డి తదితరుల మధ్య రూ.40 కోట్ల డీల్ జరిగినట్టు ఆరోపణలు
- వివేకాను హత్య చేసేందుకు రూ. 5 కోట్ల ఒప్పందం చేసుకున్నట్టు దస్తగిరి వాంగ్మూలం

- మిగతా 2లో




## 2027 వరకు ఎల్‌నినో..

### డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

- 100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు

- మిగతా 2లో

## రూ.5 కోట్లకు రేప్ కేసుల సెటిల్‌మెంట్?

### పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు



- భగవంత్ మాన్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు
- రూ.5 కోట్లకు రేప్ కేసులు సెటిల్ చేస్తున్నారని ఆరోపణ
- ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ
- ఆడియోలో లేని మాన్, ఆయన భార్య పేర్లు
- గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడ్డ కేసు

పెన్ పవర్ డెస్క్:పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్య మంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది.

- మిగతా 2లో

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం..

### 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

- హైదరాబాద్ గంజాయి కింగ్‌పిన్ నీతూ బాయిపై ఈడీ దాడులు
- మనీలాండరింగ్ ఆరోపణలపై 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఈగల్, ఎక్సైజ్ శాఖ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ కేసు నమోదు
- గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బు, ఆస్తులపై లోతైన దర్యాప్తు
- కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్టు అనుమానాలు

- మిగతా 2లో





## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

- యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ
- భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ
- బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ
- శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి

## ఎడిటర్ వ్యూ

# టీడీపీ అడ్డా..ప్రత్యర్థి ఎవరైనా.. పసుపు జెండా రెపరెపరేలేనా?

తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గంలో తిరుగులేని విధంగా ఉంది. అక్కడ టీడీపీకి పోటీ ఇచ్చే పార్టీ లేకుండా పోయింది. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఓటు బ్యాంకు పటిష్టంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. దగ్గుబాటి వెంకటేశ్వర రావు సొంత నియోజకవర్గమైన పర్చూరు తొలి నుంచి టీడీపీకి పట్టు ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పర్చూరు టీడీపీ ఖాతలో పడుతుంది. అయితే దగ్గుబాటి వెంకటేశ్వర రావుకు కుటుంబానికి పర్చూరు నియోజకవర్గంతో ఉన్న అనుబంధం కారణంగా ఆయన టీడీపీ, కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా గెలిచారు. కానీ 2019లో మాత్రం ఆయన వైసీపీ నుంచి పోటీ చేసి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ లో ఆదరించినా, వైసీపీలో మాత్రం దగ్గుబాటిని పర్చూరు దగ్గరకు తీసుకోలేదు.

**దగ్గుబాటికీ తప్పని ఓటమి...**

దీంతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాల నుంచే నిష్క్రమించాల్సి వచ్చింది. 1983 నుంచి మొన్నటి ఎన్నికల వరకూ పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ నాలుగు సార్లు గెలిచింది. అయితే వైసీపీ ఇంత వరకూ గెలుపు అక్కడ చూడలేదు. అక్కడ సామాజికవర్గాల పరంగా చూసుకున్నా టీడీపీకి ఓటు బ్యాంకు ఎక్కువగానే కనిపిస్తుంది. తొలి నుంచి ఉమ్మడి ప్రకాశ్రంలోనూ, ఇప్పటి బాపట్ల జిల్లాలో ఉన్న పర్చూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది . ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయాలను సాధించారు. పర్చూరు నియోజకవర్గంలో గుంటూరు ఛానల్ పొడిగింపు వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారు. అందుకే టీడీపీకి వెన్నుదదన్నుగా పర్చూరు నియోజకవర్గం నిలుస్తుంది. అక్కడ పోటీ చేసేందుకు సరైన నాయకుడు లేకపోవడం కూడా ప్రత్యర్థి పార్టీలకు మైనస్ అని చెప్పాలి.

**నేతలను మార్చినా...**

అభివృద్ధి పనులపై ప్రతిపక్ష వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ఛానల్ పొడిగింపు కోసం స్థానికంగా రిలే దీక్షలు కూడా చేపట్టారు.ఇటీవల మండల స్థాయిలో కొత్త అధ్యక్ష, కార్యవర్గాలను ఎన్నుకుంటూ పార్టీని మరింత పటిష్టం చేస్తున్నారు. ఇకవైసీపీ ఇక్కడ నేతలను మార్చి మార్చి బరిలోకి దింపుతున్నా ప్రయోజనం లేకపోతుంది. 2014 నుంచి 2024 ఎన్నికల వరకూ గొట్టిపాటి భరత్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, యడం బాలాజీని పోటీకి దింపారు. అయినా ఫలితం లేదు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత ఆమంచి కృష్ణమోహన్ ను పర్చూరు నియోజకవర్గం ఇన్ ఛార్జిగా నియమించారు. ఆమంచి తర్వాత వైసీపీని వీడి వెళ్లిపోయారు. ప్రస్తుతం గాదె మధుసూదన్ రెడ్డిని పర్చూరు వైసీపీ ఇన్ ఛార్జిగా నియమించారు. అయినా టీడీపీ గెలుపును అడ్డుకోవడం ఇక్కడ కష్టమే.

## 2027 వరకు ఎల్‌నినో.. డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.

సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు.ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు.భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది.

ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

**వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షాలు!**

ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్-నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది.

భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

**వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..**

ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది.ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

# అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## పాలన పక్కనపెట్టి ఈవెంట్ మేనేజ్‌మెంట్

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా పక్కనపెట్టి కేవలం ప్రచార ఆర్భాటాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తోనే ముఖ్యమంత్రి కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఇంకా ఏమాత్రం పూర్తి కాకపోయినా, అన్నీ పూర్తయినట్లు చిత్రీకరిస్తూ ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్నాథ్ మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడానికి కూటమి ప్రభుత్వం అంగీకరించడం ద్వారా రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులను దారుణంగా వంచించిందని విమర్శించారు. సహజసిద్ధంగా గ్రావిటీ ద్వారా రావలసిన నీటిని పంపింగ్ సిస్టమ్ ద్వారా తెచ్చి, ఏదో గొప్ప ఘనత సాధించినట్లు ప్రచారం చేసుకోవడం కూటమి ప్రభుత్వ డ్రామాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. పోలవరం కాలువల నిర్మాణంలో చంద్రబాబు నాయుడి పాత్ర ఏమీ లేదని...

దివంగత వైఎస్సార్, వైసీపీ అధినేత జగన్ హయాంలోనే మెజారిటీ పనులు పూర్తయ్యాయని చెప్పారు.

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించినట్లే... చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును తన స్వార్థ రాజకీయాలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఒక 'ఏటీఎం'లా వాడుకుంటున్నారని అమర్నాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేసి, సొంత అనుకూల వర్గాలకు పనులు కట్టబెడుతూ, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో విద్యా, వైద్య రంగాల పురోగతికి జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే పునాదులు పడ్డాయని గుర్తుచేసిన ఆయన, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచార ఆర్భాటాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక మూలాలను, మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది.హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు

హాజరయ్యారు.గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చేపడుతున్న ఈ విచారణతో వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సూత్రధారుల చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది.

## మోదీని అడిగే దమ్ముందా?..

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.

గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు

ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

- మొదటి పేజి తరువాయి

ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు.నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు.జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు

- మొదటి పేజి తరువాయి

కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు సంబంధించిన 7 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.సోదాల్లో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు, 8 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.ఇంకా ఇంట్లో సుమారు రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్నట్లు కూడా ఏసీబీ అధికారులు

గుర్తించారు.ఏసీబీ లెక్కల ప్రకారం సోమయ్య ఆస్తుల విలువ రూ.3,54,36,490గా తేలింది. అయితే బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన లావాదేవీలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్‌ఆర్‌సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు వైయస్‌ఆర్‌సీపీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని వైయస్‌ఆర్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు లభించిన అదనపు పది రోజుల గడువును పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్ అంశాలను పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీ ఐడీ కార్డుల పంపిణీని కార్యకర్తలను మరింత క్రియాశీలం చేసే కార్యక్రమంగా నిర్వహిస్తూ, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు సమావేశాలు, 'వెన్నుపోటు పార్టీ--వెన్నుపోటు పాలన' ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఎన్నికల సన్నద్ధత మాటల్లో కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించేలా పటిష్టమైన క్యాలెండర్, సమయపట్టికతో కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

తాడేపల్లిలోని వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీ/పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యే/నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ, 'వెన్నుపోటు పార్టీ--వెన్నుపోటు పాలన' ప్రచారం తదితర అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం.. 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోథా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈగల్ అధికారులు జరిపిన దాడుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా పలువురు బానిసలు ఆమె ఇంటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.అయితే, పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్నప్పటికీ నీతూ బాయి అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. 2024లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఆమె నివాసంపై దాడి చేసి 20 కిలోల గంజాయి, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. సోదాలు ముగిసిన తర్వాత ఈ దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ వెల్లడించే అవకాశం ఉంది.

## రూ.5 కోట్లకు రేప్ కేసుల సెటిల్‌మెంట్?

- మొదటి పేజి తరువాయి

మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు.

ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది.ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి."భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా? అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.

# మండలంలో ఘనంగా ఏ ఎస్ ఆర్ అరణ్య కార్యక్రమం



✷ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటిన అటవీ సిబ్బంది.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 3.** జిల్లా కలెక్టర్ టి నిశాంతి, చింతపల్లి డివిజనల్ అటవీ శాఖ అధికారి వైవి నరసింహారావు ఆదేశాల మేరకు చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏ ఎస్ ఆర్ అరణ్య కార్యక్రమాన్ని చింతపల్లి రేంజ్ అధికారి బి అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి అప్పారావు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మొక్కలు ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయన్నారు. నేడు పెంచుతున్న మొక్కలే రేపటి తరానికి వృక్ష సంపదను అందించి మానవ మనుగడకు దోహదపడతాయన్నారు. మొక్కల పెంపకం వలన కాలుష్య నివారణతో పాటు మనుష్య మనుగడకు అవసరమైన ఆక్సిజన్ సహజ, ప్రకృతి సిద్ధంగా ప్రతి జీవి పొందవచ్చును అన్నారు. మానవాళితో మొక్కలకు విడదీయరాని అనుబంధం ఉందని మొక్కల ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అటవీ సిబ్బంది కే జ్యోతి, రీమల భద్రం, కే దుర్గాప్రసాద్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పెండింగ్ కేసులపై 'డ్రైవ్ మోడ్'లో పనిచేయాలి

✷ ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
✷ విశాఖ, భీమిలి రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబరు 03 :** రెవెన్యూ శాఖకు సంబంధించిన దీర్ఘకాలిక, క్లిష్టమైన సమస్య లను పరిష్కరించేందుకు అధికారులు 'డ్రైవ్ మోడ్'లో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. పెండింగ్ సమస్యలను నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. కలెక్టరే ట్‌లో గురువారం నిర్వహించిన విశాఖపట్నం, భీమిలి రెవె న్యూ డివిజన్ల రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా పెండింగ్ సమస్యలు, బల్క్ ఇష్యూస్, 22ఏ కేసులు, డీ-నోటి ఫికేషన్, ఆక్రమణల క్రమబద్ధీకరణ, మాన్యువల్ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రతి సమస్యకు స్పష్టమైన కాలపరిమితి నిర్దేశించుకుని లక్ష్యా లను సాధించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిర క్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెరువులు, ఇతర జలవన రుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు.

ప్రజా ప్రయోజనాల కోసం భూములు కోల్పోయిన వారికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవా లని కలెక్టర్ సూచించారు. 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్ అంశాల పరిష్కారానికి వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని పురోగతి సాధించాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న వినతులకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాల యాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు అధికారుల దృష్టికి రాని క్లిష్టమైన రెవెన్యూ సమ స్యలపై వీఆర్వోల ద్వారా ప్రత్యేకంగా సమాచారం సేకరించి నివేదించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ సేవలను మరింత విస్తృ తం చేయాలని సూచించారు. మెట్రో, రైల్వే తదితర కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రి యను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, డిప్యూటీ కలెక్టర్లు గోవిందు, అనిత, మాధవీలత, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ అనుమతులు ఆన్‌లైన్‌లో ఉచితం



**గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి**
**కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**
**మండపాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనసరి - జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి.**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, సెప్టెంబర్ 3:** జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 'సింగిల్ విండో' విధానంలో రూపాయి కూడా రుసుము చెల్లించకుండా ఉచితంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని, దరఖాస్తు చేసుకోగానే అధికారులే నేరుగా వచ్చి పరిశీలిస్తారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ,జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు తగినంత ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతుల విధానంపై శుక్రవారం డివిజన్, ఆ మరుసటి రోజు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణహిత మండపాలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో కమిటీ సభ్యులు ప్రజలను చైతన్యవంతలను చేయాలని కోరారు. అన్నదానాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని లేకుండా చూడాలని,బీఐఎస్ లేదా ఐఎస్ఐ ప్రమాణాలున్న విద్యుత్ పరికరాలనే మండపాలలో వాడాలని, భారీ విగ్రహాలకు సంబంధించి మండపాల వద్ద ఇంజినీరింగ్ అధికారుల నుంచి నిర్మాణ దృఢత్వ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని తేల్చిచెప్పారు.

నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు, వెలుతురు, పారిశుద్ధ్యం, క్రేన్లు అందుబాటులో ఉంచాలని, ఈతగాళ్ల వివరాలను ముందే నమోదు చేసుకుని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ 'గణేష్ ఉత్సవ్ 2026' పోర్టల్ ( https://ganeshutsav.net) ద్వారా దరఖాస్తు చేసుకుంటే స్థానిక సంస్థలు, ఇతర శాఖల అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఊరేగింపుల్లో అధిక శబ్ద తీవ్రత కలిగిన డీజేలు వినియోగించరాదని కోరారు, మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదకరమైన ప్రవాహం ఉన్న నదులు, కాలువల్లో నిమజ్జనానికి అనుమతి లేదని, తహసిల్దార్లు, పోలీసులు ముందే గుర్తించిన సురక్షిత ప్రాంతాలు, తాత్కాలిక నిమజ్జన గుండాల వద్దనే నిమజ్జనాలు చేయాలని కలెక్టర్, ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, కాశీబుగ్గ డీఎస్పీ భవాని, టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, ఆన్‌లైన్ ద్వారా పలాస టెక్కలి ఆర్డీవోలు కృష్ణమూర్తి అప్పలరాజు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సింతు సుధాకర్, భాస్కరరావు, డాక్టర్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# సంగడ పాఠశాలలో వసతి సౌకర్యం కల్పించాలి - జెడ్పీ చైర్పర్సన్

✷ వసతి కల్పిస్తే నాలుగు పంచాయతీలకు మేలు జరుగుతుందని వెల్లడి.
✷ 500కు పైబడి పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి.
✷ వసతి గృహం ఏర్పాటు కు కూటమి ప్రభుత్వం జిల్లా విద్యాశాఖఅధికారులు దృష్టి సారించాలి.
✷ సంగడ హై స్కూల్ సందర్శించిన జెడ్పీ చైర్ పర్సన్ అరబీరు సుభద్ర.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 03.** ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాల సరిహద్దు ముంచంగిపుట్టు మండలం సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వసతి సౌకర్యం కల్పిస్తే నాలుగు పంచాయతీల పరిధిలో 500 పైగా విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని జిల్లా పరిషత్తు చైర్పర్సన్ అరబీరు సుభద్ర పేర్కొన్నారు. ముంచంగిపుట్టు మండలం సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమస్యలను తెలియజేశారు. గతంలో ఈ పాఠశాల ఎయిడెడ్ గా ఉండేదని ఏపీ జెన్ కో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా నిర్వహణ అవుతుందని తెలిపారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడం అందులోనూ హాస్టల్ వసతి లేకపోవడం కారణంగా ఇక్కడ అత్యుత్తమ ఉపాధ్యాయులు ఉన్నా సరే పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ పాఠశాలకు హాస్టల్ వసతులు కల్పిస్తే ఖచ్చితంగా 500కు పైబడి విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించేందుకు సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తెలియజేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ.. సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలో నాలుగు పంచాయతీలు ఉన్నాయని వనుగుమ్మ, మాకవరం, దోడిపుట్టు, రంగబయలు ఉన్నాయన్నారు. ఈ పంచాయతీల పరిధిలో ప్రాథమికొన్నత పాఠశాలలు ఉన్నాయని వీరందరికీ సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకటే ప్రధానమైనటువంటి ఏకైక హై స్కూల్ అన్నారు. ఈ హైస్కూల్ పరిధిలో ఉన్న ఎంపీ యు పి స్కూల్ లలో చదివే పిల్లలంతా ఈ స్కూల్లోనే చదవాలన్నారు. కానీ హాస్టల్ సౌకర్యం లేని పక్షంలో ఇక్కడ విద్యార్థులను తీసుకొని పోయి వారి వారి పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. ప్రస్తుతం 20 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అందుకే ప్రభుత్వం స్పందించి ఈ పాఠశాలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. హాస్టల్ సౌకర్యం లేకే ఇక్కడ చదువుతున్న పిల్లలు తమ తల్లిదండ్రులు టీసీలు తీసేసుకొని వేరే పాఠశాలలో చేర్పించారన్నారు. ఇప్పుడు వీరంతా వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా ఈ పాఠశాలలో హాస్టల్స్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారన్నారు. పీఎం జన్ మన్ నుంచి పాఠశాలకు వసతి సౌకర్యం మంజూరుకు అధికారుల కృషి చేయాలన్నారు. ఈ పాఠశాలను 1982లో స్థాపించారని, 40 ఏళ్లు అవుతున్న పాఠశాలకు కనీసం మరమ్మతులు లేవని తక్షణమే పాఠశాలకు మరమ్మతులు కూడా చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వైసీపీ నేతలు తిరుపతి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# డొక్కులూరు ఘాట్ ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు పరామర్శ



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ డొక్కులూరు ఘాట్ సమీపంలో గురువారం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. డొక్కులూరు గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు, గ్రామస్థులు సంకాడ కొత్తూరులో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటేందుకు వాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు వెంటనే స్పందించారు. క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించి, వైద్యుల వద్ద దగ్గరుండి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన ఎమ్మెల్యే, చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జి.మాడుగుల మండల పార్టీ అధ్యక్షులు నిర్మాని మత్యకొండం నాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గురువే దిక్కయ్యారు..!

**64 మంది విద్యార్థుల చదువు కోసం సొంత ఖర్చుతో రేకుల షెడ్డు**
**ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కిట్లంగి పెద్దబ్బాయి సేవాభావం**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా కనీస మౌలిక వసతులు ఉండాలి. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం డి. పెదపాడు గ్రామ పాఠశాలలో పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఏకంగా 64 మంది విద్యార్థులకు కేవలం ఒక్కటే తరగతి గది ఉండటంతో చిన్నారుల విద్యాభ్యాసం తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది.పాఠశాలలో 33 మంది బాలురు, 31 మంది బాలికలు కలిపి మొత్తం 64 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ఇంతమంది విద్యార్థులకు ఒక్క తరగతి గది మాత్రమే అందుబాటులో ఉండటంతో బోధన నిర్వహణతో పాటు విద్యార్థుల అభ్యసనకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు ఒక వాలంటీర్ సేవలందిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసిన ఉపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కిట్లంగి పెద్దబ్బాయి, డి. పెదపాడు గ్రామస్థులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. పలువురు గ్రామస్థులు శ్రమదానం చేసి పాఠశాల ఆవరణలో తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా తమవంతు సహకారం అందించారు.ఈ తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి అవసరమైన రేకులు, ఇనుము, ఇతర సామగ్రి కొనుగోలు ఖర్చులను కిట్లంగి పెద్దబ్బాయి స్వయంగా భరించడం విశేషం. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఆయన తీసుకున్న చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థులు, ఉపాధ్యాయులు తమవంతు బాధ్యతగా ముందుకొచ్చి విద్యార్థులకు తాత్కాలిక సౌకర్యం కల్పించినప్పటికీ, రేకుల షెడ్డు శాశ్వత పరిష్కారం కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం, ఎండాకాలంలో ఈ షెడ్డు కింద విద్యార్థులు చదువుకోవడం కూడా సమస్యాత్మకమేనని అంటున్నారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదిని నిర్మించి మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తాత్కాలిక పరిష్కారం చూపిన నేపథ్యంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి డి. పెదపాడు పాఠశాలకు అదనపు తరగతి గదిని మంజూరు చేయాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు."పిల్లల చదువు కోసం గ్రామం ముందుకొచ్చింది... ఇప్పుడు వారి భవిష్యత్తు కోసం ప్రభుత్వం స్పందించాలి" అంటూ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాన్ బీబీ, పాఠశాల కమిటీ చైర్మన్ పి. కృష్ణ, వాలంటీర్ గిరిబాబు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులలో వలి సెల సాగు లాభదాయకం.

- తక్కువ నీటితో లాభదాయక పంటలపై రైతులు దృష్టి సారించాలి
- ఏ డి ఆర్ డాక్టర్. బి. ఆదిలక్ష్మి.




**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 3.** ప్రస్తుతం సూపర్ ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితి ఏర్పడినందువల్ల అతి తక్కువ నీటితో వర్షాధారంగా పండి, రైతులకు ఆదాయం చేకూర్చే వలిసెల పంట సాగుపై రైతులు దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్. బి. ఆదిలక్ష్మి తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అనకాపల్లి వారి గిరిజన ఉపప్రణాళిక పథకంలో భాగంగా గురువారం చింతపల్లి మండలంలోని ఎర్ర బొమ్మలు, కొలపరి, సిరిపురం, మడిగుంట మరియు తాజంకి గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు వలసల సాగుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరిసెల శిక్షణ కార్యక్రమం తో పాటు, ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం ఉత్కల్ నైజర్ 150 విత్తనము, నత్రజని, బాస్వరము మరియు పొటాసుకు సంబంధించిన జీవన ఎరువులు సూడో మనోస్ మరియు ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంధ్ర నాస్తినిలు,వేప నూనె, టార్పాలిన్ పట్టాలు మరియు విత్తన భద్రత కొరకు ప్లాస్టిక్ డ్రమ్ములను రైతులకు పంపిణీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వలసల పంట సాగు అత్యంత ఆవశ్యకమని ఏడిఆర్ తెలిపారు. వలస పంట సాగు లో మెలకువలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అనకాపల్లి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి ఉమామహేశ్వరరావు, శాస్త్రవేత్తలు డాక్టర్. బయ్యపురెడ్డి, డాక్టర్. బాల హుస్సేన్ రెడ్డి, సందీప్ నాయక్, జోగారావు, టాటా ట్రస్ట్ అధికారి డాక్టర్. కే.అప్పలరాజు మరియు రైతులు పాల్గొన్నారు.

## రాజ్మా విత్తనాల కోసం రైతుల క్యూ

ఓటీపీలు రాక రైతుల ఇబ్బందులు



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్ సెప్టెంబరు 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి రైతు భరోసా కేంద్రంలో రాజ్మా చిక్కుళ్ల విత్తనాల కోసం రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వం 90 శాతం రాయితీతో రాజ్మా విత్తనాలను అందజేస్తుండటంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ఆర్బీకేకు చేరుకున్నారు.అయితే విత్తనాల పంపిణీ సమయంలో రైతుల మొబైల్ ఫోన్లకు ఓటీపీలు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓటీపీ కోసం కొందరు రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు బారులు తీరారు.90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రాజ్మా విత్తనాలను అందజేస్తుండటంతో రైతులు వాటిని పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో రాజ్మా సాగుకు అనుకూల పరిస్థితులు ఉండటంతో ఈ విత్తనాలకు విశేష డిమాండ్ ఏర్పడింది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా ఓటీపీలు సకాలంలో అందకపోవడంతో రైతులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాజ్మా విత్తనాల పంపిణీ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## పేసా చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- నల్లరాయి క్వారీ వల్ల పంటలను నష్టపోతున్న గిరిజనులు.
- ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 3.** పేసా చట్టాన్ని ఉల్లంఘించి నల్లరాయి క్వారీ నిర్వహణకు రహస్యంగా గ్రామసభ తీర్మానం చేపట్టిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు అంతర్ల నల్లరాయి క్వారీని సందర్శించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణాల పేరిట అనుమతులు తీసుకున్న స్థానికేతర గిరిజనుడు మూడేళ్లపాటు నల్లరాయి క్వారీ నిర్వహించి వ్యాపారం చేశాడన్నారు. జాతీయ రహదారి నిర్మాణాలు పూర్తి కావడంతో పాటు లీజు అనుమతులు ముగిసిపోయాయన్నారు. నల్లరాయి క్వారీని కొనసాగించేందుకు స్థానికేతర బినామీ గిరిజనుడు లీజు తిరిగి పొందేందుకు అడ్డదారిలో అనుమతి పొందేందుకు పైరవీలు చేస్తున్నాడన్నారు.

గిరిజనుల చట్టాలను కాపాడాల్సిన పంచాయతీ ప్రత్యేక అధికారి, కార్యదర్శి నిర్వాహకుల మామూళ్లకు/తాంబూలాలకు కక్కుర్తిపడి ఈ నెల 25వ తేదీన నిబంధనలకు విరుద్ధంగా నల్లరాయి క్వారీకి అనుకూలంగా తీర్మానం చేశారన్నారు. పేసా గ్రామసభ నిర్వహణకు స్థానిక గిరిజనులకు కనీస సమాచారం ఇవ్వలేదని, గ్రామంలో దండోరా వేయించలేదని, పత్రికా ప్రకటన సైతం ఇవ్వలేదన్నారు. కేవలం ఒక వర్గానికి చెందిన గిరిజనులతో క్వారీకి అనుకూలంగా తీర్మానం చేసి మైనింగ్ శాఖ, జిల్లా కలెక్టర్‌కి పంపించేందుకు పంచాయతీ అధికారులు సిద్ధపడుతున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

అలాగే క్వారీ నిర్వహణ వల్ల పెంటపాడు, అంతర్ల గిరిజనుల పంటలు పండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. క్వారీ నిర్వహణను అడ్డుకుంటామని, అవసరమైతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

# చింతపల్లి ఎంపీడీవో గా లాలం సీతయ్య బాధ్యతల స్వీకరణ.

## ఎంపీడీవోను అభినందించి శుభాకాంక్షలు తెలిపిన పలువురు కూటమి నాయకులు.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 3.** చింతపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ( ఎంపీడీవో)గా లాలం సీతయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన చింతపల్లి ఇన్ టార్చ్ ఎంపీడీవో గా బాధ్యతలు నిర్వహించారు. చింతపల్లి తో ఈయనకు మూడేళ్ల అనుబంధం ఉంది. ఇన్చార్జ్ ఎంపీడీవో గా పనిచేసే సమయంలో మండలంలోని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి అనేక చర్యలు చేపట్టారు. అనంతరం డుంబ్రిగూడ మండలం ఎంపీడీవో గా పదోన్నతి పై వెళ్లారు. పరిపాలనా సౌలభ్యం మండల అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ నిశాంతి సిఫారసు మేరకు బదిలీ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణమూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డుంబ్రిగూడ మండలంలో ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న సీతయ్యను చింతపల్లి మండల ఎంపీడీవోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో సీతయ్య మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తానని, గ్రామ సమస్యలు అధికార యంత్రాంగం పనితీరును మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ పరిపాలన మరింత చురుగ్గా సాగడానికి అభివృద్ధి పనులపై దృష్టి సారించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. చింతపల్లి మండలంతో తనకున్న అవగాహనపై పరిపాలన సక్రమంగా అందించడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు పుష్పగుచ్చాలు అందించి ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణరావు, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, చెన్నకేశవ, తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకుడు రీమల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో పోలీస్ అనుమతులు..!

**పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై సురేష్ సూచన**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేయనున్న ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆన్‌లైన్ అనుమతి విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.గూడెంకొత్తవీధి మండల పరిధిలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు పోలీసు అనుమతి కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఎస్సై సురేష్ సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసు అనుమతి పొందేందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. మండపం ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు సంబంధిత పోర్టల్‌లో అవసరమైన వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగానే పోలీసు అనుమతులు పొందాలని ఎస్సై సురేష్ కోరారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యా ప్రమాణాలు మెరుగు పడేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలి.

- విద్యార్థులతో కలిసి మధ్యహాన భోజనం చేసిన జడ్పిటిసి పోతురాజు బాలయ్య.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 3.** మండలంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులందరూ సమన్వయంతో పనిచేయాలని చింతపల్లి జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య అన్నారు. గురువారం ఆయన మండలంలోని పెదబరడ పంచాయతీ కృష్ణాపురం జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించిన మీదట సంతృప్తిగా ఉందన్నారు. పాఠశాల ఆవరణలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. మండలంలోని మిగతా పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తే మండలంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడి విద్యార్థులు మంచి స్థాయికి చేరుకోగలరని ఆశాభావాన్ని వ్యక్తీకరించారు. ఉపాధ్యాయులందరూ ఆ దిశగా ఆలోచనలు చేసి విద్యా ప్రమాణాల మెరుగుపడే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం ఆయన మధ్యహాన భోజన పథకాన్ని పరిశీలించి, స్వయంగా విద్యార్థులకు వడ్డించి, విద్యార్థులతో కలిసి మధ్యహాన భోజనాన్ని రుచి చూసి, భోజనం చేశారు. వంటలు చాలా బాగున్నాయి అని ఉపాధ్యాయులను, మధ్యాహ్నం భోజన పథక సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు సాగిన గంగన్న పడాల్, ఉపాధ్యాయులు వి అప్పారావు, జి.వి.ఆర్ మూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దామనాపల్లిలో ఓటర్ల జాబితాపై గ్రామసభ




- పోలింగ్ కేంద్రాల వివరాల వెల్లడి..

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ ఓటర్ల జాబితా ప్రచురణ కోసం గురువారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో వివిధ వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను చదివి వినిపించారు.అదేవిధంగా గ్రామంలోని పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్. లక్ష్మి, పీసా కార్యదర్శి మాదిరి చంటిబాబు, కర్రయ్య, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, కూటమి నాయకులు పల్లం నాయుడు, సతీష్, మూర్తి, గెమ్మెలి బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది సింహాచలం, కళ్యాణి, ఉష, రమణమ్మ, సత్యనారాయణతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దారకొండ--గుమ్మిరేవుల రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలి

- 26 కిలోమీటర్ల రహదారి గుంతలమయం.. ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
- ఆదివాసి స్వయంపాలన సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్ డిమాండ్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని దారకొండ నుంచి గుమ్మిరేవుల మీదుగా పోలవరం జిల్లా పాతకోట, గురుతేడు, వై.రామవరం ప్రాంతాలను అనుసంధానించే ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదివాసి స్వయంపాలన సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్ డిమాండ్ చేశారు.దాదాపు 26 కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ తర్వాత తమ గ్రామాలకు తారు రోడ్డు రావడంతో స్థానికులు సంతోషించారని, అయితే రోడ్డు నిర్మాణం పూర్తయి ఎనిమిదేళ్లు కూడా గడవకముందే ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాల కారణంగా రహదారి దెబ్బతిన్నదని తెలిపారు.భారీ గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారడంతో ప్రయాణం మరింత కష్టతరంగా మారుతోందన్నారు.

**బస్సు సేవలు దారకొండకే పరిమితం**

మాదిగమల్లు బ్రిడ్జి ధ్వంసం కావడంతో పాటు రహదారి అధ్వానంగా మారడంతో నర్సీపట్నం నుంచి గుమ్మిరేవుల వరకు నడవాల్సిన బస్సు సర్వీసులు దారకొండ వరకే పరిమితమవుతున్నాయని సోమేశ్ కుమార్ తెలిపారు. దారకొండ దాటి గుమ్మిరేవుల వైపు వెళ్లే ప్రజలు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నప్పటికీ ఇంకా పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రహదారి అధ్వానంగా ఉండటంతో అత్యవసర వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని సోమేశ్ కుమార్ అన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఆసుపత్రులకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, రోగులు, రోజువారీ ప్రయాణికులు కూడా ప్రతిరోజూ సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రహదారి సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి గుంతలను పూడ్చడంతో పాటు నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు."ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు కేవలం ప్రయాణ మార్గాలు మాత్రమే కాదు.. విద్య, వైద్యం, ఉపాధి, అత్యవసర సేవలకు జీవనాడులు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ సమస్యను ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలి" అని మడపల సోమేశ్ కుమార్ కోరారు.

# విజయవంతంగా హుకుంపేట గ్రామసభ

**ఓటర్ జాబితా పై ప్రజల అభిప్రాయ సేకరణ.**



**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 3 :** అల్లూరి సీతారామరాజుజిల్లా అరకు నియోజకవర్గం.

హుకుంపేట మండల కేంద్రంలో గ్రామసభ

ఎంపీడీవో రమాదేవి మరియు పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, మరియు ప్రజా సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు.

అంతే కాకుండా ఎస్సీ,బీసీ,ఓసి,ఓటర్లను తుది జాబితా మరియు నివేదికకు సంబంధించిన అంశాలను ప్రజలకు తెలియజేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం. అని అన్నారు

మన గ్రామం మన బాధ్యత మన అభివృద్ధి. అనే అంశాలను గుర్తు చేశారు ఈ యొక్క కార్యక్రమంలో హుకుంపేట ఎంపీడీవో స్పెషల్ ఆఫీసర్ పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, రమాదేవి, వైసీపీ మండల అధ్యక్షులు అనిల్, ఎంపిటిసి కొమ్మ రమ,మాజీ సర్పంచ్ వెంకట పూర్ణిమ, వైస్ సర్పంచ్, కోడి దాస్ గోవింద్, చల్లంగి సూర్యనారాయణ కూటమి నాయకులు సిర్గం సూర్యకాంతం పాడి వెంకట్, వంతల వెంకట్, సమరెడ్డి కొండలరావు, అలాగే గ్రామ పంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఓటర్ల జాబితా పరిశీలన.. రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ

**90 శాతం రాయితీపై 160 మంది రైతులకు విత్తనాలు అందజేత**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గాలికొండ, అమ్మవారిధారకొండ పంచాయతీల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల వివరాలను అధికారులు పరిశీలించారు. గురువారం గాలికొండ, అమ్మవారిధారకొండ పంచాయతీల ప్రత్యేక అధికారి డాక్టర్ లోకుల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీల్లోని ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు గ్రామస్తుల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటర్ల జాబితా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం రెండు పంచాయతీల పరిధిలోని రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చేతుల మీదుగా 160 మంది రైతులకు ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తున్న ఈ విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని గిడ్డి ఈశ్వరి కోరారు. రాజ్మా సాగుతో రైతులు మెరుగైన దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ కిల్లో రమేష్ నాయుడు, జీసీసీ రాష్ట్ర డైరెక్టర్ బొర్రా నాగరాజు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ జయనాగదేవి, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గౌతమి హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కృష్ణుడు, రాధా వేషధారణల్లో అలరించిన విద్యార్థులు**




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం తలారిసింగి గ్రామంలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఒకరోజు ముందుగానే ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలతో సందడి చేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి దాడి వెంకట శివ, జనసేన పార్టీ నాయకులు ఊలం ఈశ్వర్ రావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు ప్రదర్శించిన కృష్ణ, రాధా వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## కలెక్టర్ హామీతో రిలే నిరాహార దీక్ష వాయిదా



- 15 రోజుల్లో భూ సమస్య పరిష్కరిస్తామని హామీ..
- చిన్న, పెద్ద అగ్రహారం రైతులకు ఊరట

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారం గ్రామాలకు చెందిన 83 కుటుంబాల రైతుల భూ హక్కుల సమస్యపై చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలు జిల్లా కలెక్టర్ హామీతో తాత్కాలికంగా వాయిదా పడ్డాయి.రైతుల వివరాల ప్రకారం.. గత ఏడు సంవత్సరాలుగా తమ భూములకు సంబంధించిన పట్టాలు జీకే వీధి పంచాయతీ వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోవడంతో ప్రభుత్వ పథకాల ద్వారా అందాల్సిన ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా తదితర ప్రయోజనాలు పొందలేకపోతున్నామని తెలిపారు. తమ పట్టాలు దుప్పులవాడ పంచాయతీలోని డి.అగ్రహారం గ్రామంలో నమోదై ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం రైతులు పలుమార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యారు. సోమవారం సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు, గ్రామ పెద్దలతో కలిసి తహసీల్దార్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్య జిల్లా కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటుందని తహసీల్దార్ వివరించినట్లు తెలిపారు.దీంతో రైతులు సెప్టెంబర్ 3వ తేదీ నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. ఈ విషయం స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 2న పాడేరుకు ఆయా గ్రామాలకు చెందిన కొందరు రైతులను పిలిపించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. సమస్యను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత దిగువ స్థాయి అధికారులను ఆదేశించినట్లు రైతులు తెలిపారు. కలెక్టర్ హామీపై నమ్మకంతో తాత్కాలికంగా రిలే నిరాహార దీక్షను వాయిదా వేసుకున్నట్లు పేర్కొన్నారు.

**రాజ్మా విత్తనాలు అందించాలని విజ్ఞప్తి**

భూ సమస్యతో రాజ్మా విత్తనాల పంపిణీని ముడిపెట్టకుండా చిన్న, పెద్ద అగ్రహారం గ్రామాల రైతులకు రాజ్మా విత్తనాలు అందించాలని గాలికొండ ఎంపీటీసీ బుజ్జిబాబు కోరారు. ఇదే తరహా సమస్యతో మండలంలోని మరికొన్ని పంచాయతీల రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆయా పంచాయతీల రైతుల భూ సమస్యలను కూడా అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు, అగ్రహారం పీసా కమిటీ కార్యదర్శి కొర్ర అనిల్‌కుమార్‌తో పాటు గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## ఏఐ ఆధారిత ప్రాజెక్ట్ ఎక్స్‌పో--2026 నిర్వహించిన విజ్ఞాన్



**కూర్మన్న పాలెం: పెన్ పవర్, సెప్టెంబర్ 3, 2026:** దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో రెండు రోజుల పాటు ఏఐ–పవర్డ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో--2026 నిర్వహించారు. ఈ ఎక్స్‌పోలో ఏఐ మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. మొత్తం 54 జట్లు ఈ ఎక్స్‌పోలో పాల్గొన్నాయి.

ఆలోచనలు ఆవిష్కరణతో కలిసే చోట, సాంకేతికత సృజనాత్మకతతో మమేకమయ్యే చోట, యువ మేధస్సులు సమస్యలను తెలివైన పరిష్కారాలుగా మలిచే వేదిక అనే థీమ్‌తో నిర్వహించిన ఈ ఎక్స్‌పోలో ఆరోగ్యరంగం, వ్యవసాయం, విద్య, స్మార్ట్ ఆటోమేషన్, సుస్థిర అభివృద్ధి తదితర రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు తమ వర్కింగ్ ప్రోటోటైప్స్‌ను ప్రదర్శిస్తూ, ప్రాజెక్టుల సమస్యా వివరణ, విధానాలు, ఉపయోగించిన ఏఐ మోడల్స్, సాంకేతికతలు మరియు వాస్తవ సమయ అనువర్తనాలను మూల్యాంకనకర్తలు, సందర్శకులకు వివరించారు.

ఈ కార్యక్రమానికి ఏఎన్‌ఐటీఎస్ కాలేజ్ డీన్--ఆర్ అండ్ డీ డా. శివ రంజని మరియు కోడ్ విజన్ టెక్నాలజీస్ సీఈఓ బి. విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి, వారి సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం మరియు వినూత్న ఆలోచనా విధానాన్ని అభినందించారు.

ఈ సందర్భంగా డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్, డా. వి. మధుసూదన రావు, రెక్టర్, మరియు డా. జి. నీలిమ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి, విద్యార్థులు మరియు నిర్వాహకులను అభినందించారు. వాస్తవ సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను రూపొందించేందుకు విద్యార్థులు చేసిన కృషిని ప్రశంసిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను నిరంతరం అభ్యసించి, వినూత్న ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమాన్ని జి. మణి మరియు మృణా దూబే సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

ఎక్స్‌పో ముగింపు సందర్భంగా ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శించిన జట్లను సత్కరించి, అనంతరం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణ, అనుభవాత్మక అభ్యసనం, సృజనాత్మకత మరియు భవిష్యత్‌కు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంలో విజ్ఞాన్ సంస్థకు ఉన్న నిబద్ధత అని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

## ఓటర్ల సమస్యలను గ్రామసభ ద్వారా పరిష్కరించుకోవాలి



ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా ప్రదర్శన

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**ఓటర్లకు సంబంధించిన సమస్యలు ఉంటే గ్రామసభ ద్వారా పరిష్కరించుకోవచ్చని జీకే వీధి పంచాయతీ కార్యదర్శి పండ్ర పాల్ తెలిపారు. గురువారం జీకే వీధి పంచాయతీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామసభకు జీకే వీధి ప్రత్యేక అధికారి, మండల వ్యవసాయ అధికారి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని ఓటర్ల జాబితాను ప్రదర్శించి, ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలు, తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు రాజేశ్వరి, రాజులమ్మ, జనసేన నాయకుడు గొర్లె వీర వెంకట్, పేసా కమిటీల ప్రతినిధులు ముక్కలి గిరి, లకే రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## డోకులూరు ఘాట్‌రోడ్డులో బొలెరో బోల్తా

**20 మంది కూలీలకు గాయాలు.. 10 మందికి తీవ్ర గాయాలు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలోని డోకులూరు ఘాట్‌రోడ్డులో గురువారం బొలెరో మినీ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 20 మంది కూలీలు గాయపడగా, వారిలో 10 మందికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.స్థానికుల వివరాల ప్రకారం.. డోకులూరు నుంచి సంకాడ కొత్తూరు వైపు సిల్వర్ మొక్కలతో కూలీలను తీసుకెళ్తున్న బొలెరో వ్యాన్ డోకులూరు ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్దకు చేరుకోగానే డ్రైవర్ స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డు అవతలికి దూసుకెళ్లి బోల్తా పడింది.ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే బయటకు తీసి పెదవలస ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మరింత మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన వారిలో గబులంగి బాలమ్మ (45), గబులంగి బుజ్జి, గబులంగి సంకురమ్మ, గబులంగి సత్యవతి, లోత కృష్ణవేణి, లోత సత్యవతి, లోత రాంబాబు, పోత్తూరు సోమరాజు తదితరులు ఉన్నట్లు సమాచారం. మరో 10 మంది స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.ప్రమాదానికి గురైన బొలెరో వాహనం లక్కవరపుపేట గ్రామానికి చెందినదిగా సమాచారం. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

## ఐదు గ్రామాల్లో 267 పాస్‌పుస్తకాల పంపిణీ

**సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం**




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**అల్లూరి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గూడెంకొత్తవీధి మండలంలో గతంలో రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం కింద భూ హక్కు పత్రాల పంపిణీ చేపట్టనున్నట్లు తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు తెలిపారు.మండలంలోని ఐదు గ్రామాల్లో సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మొత్తం 267 పాస్‌పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.పాస్‌పుస్తకాల పంపిణీ షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 7న కట్టుపల్లి, సెప్టెంబర్ 9న ఉసిరిగూడెం, సెప్టెంబర్ 10న బోనంపల్లి గ్రామాల్లో పంపిణీ జరుగుతుంది. అలాగే సెప్టెంబర్ 11న ఉదయం సంతనేరోడుపల్లి, మధ్యాహ్నం కొమ్ములవాడ గ్రామాల్లో పాస్‌పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.రీ–సర్వే అనంతరం భూ హక్కులకు సంబంధించిన పాస్‌పుస్తకాలు అందుకోనున్న లబ్ధిదారులు సంబంధిత గ్రామాల్లో నిర్వహించే పంపిణీ కార్యక్రమానికి హాజరై పత్రాలను స్వీకరించాలని తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు సూచించారు.

# టీడీపీలోకి యువనాయకురాలు కొల్లాబత్తుల ప్రసూన

**రాజకీయాల్లో పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం యువత రావాలి: ఎంపీ.భరత్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 03 :** తెలుగుదేశం పార్టీలోకి యువనాయకురాలు కొల్లాబత్తుల ప్రసూన రాజకీయ రంగప్రవేశం చేశారు. విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ ఆమెతో పాటు 13 మంది అనుచరులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమానికి 47వ వార్డుతో పాటు వివిధ వార్డుల కు చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ కార్యకర్తలు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి దుబా య్‌లో మంచి ఉద్యోగాన్ని వదులుకుని ప్రజాజీవితం లోకి రావాలనే ప్రసూన నిర్ణయం అభినందనీయమన్నారు. యువ త రాజకీయాల్లో పదవుల కోసం కాకుండా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు రావాలని సూచించారు. మంచి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేసి మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

అభివృద్ధితో పాటు జీవనశైలిలో మార్పు అవసరం

రాష్ట్రంలో పెట్టుబడులు రావడం, పరిశ్రమలు ఏర్పడటం, ఉద్యోగాలు లభించడం మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదని శ్రీభరత్ అన్నారు. ప్రజల జీవనశైలిలో కూడా సానుకూ ల మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున నగరాన్ని పరిశు భ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.అభివృద్ధి చెందిన నగరాల్లో ప్రజలు చట్టాలను క్రమశిక్షణతో పాటిస్తున్నారని, మన నగరాల్లోనూ చట్టాలను గౌరవించే పౌర సంస్కృతి పెంపొందాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అభివృద్ధి కోసం కృషి చేస్తున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా సంపూర్ణ మార్పు సాధ్యం కాదని పేర్కొన్నారు. మార్పు ఒక్కరోజులో రాదని, నిబద్ధతతో, ఓపికతో నిరంతరం పనిచేస్తే కాలక్రమేణా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు నీటి భద్రత

వర్షాలు సక్రమంగా లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపో యి అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తుతోందని శ్రీభరత్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏడాది పొడవునా నీటి లభ్యతకు మరింత భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రా జెక్టును పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పా రు.గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడంతో నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగిందని ఆయ న పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పనులను వేగవంతం చేసి, ప్రస్తుత టర్మ్‌లో ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ముం దుకు సాగుతోందన్నారు.ఇప్పటికే అనకాపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు చేరడం శుభపరిణామమని, త్వరలోనే విశాఖపట్నానికి కూడా పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్రకు నీటిని తీసుకురావడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు.

సమన్వయంతో వార్డుల అభివృద్ధి

కొల్లాబత్తుల ప్రసూన స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయాలని శ్రీభరత్ సూచించారు. వార్డు లోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్తే అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి వార్డుల అభి వృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు."మంచి దారిని ఎంచుకుని, ప్రజలకు సేవ చేస్తూ మంచి పేరు సంపాదించు కోవాలి. ప్రసూనతో పాటు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీలోకి హృదయపూర్వక స్వాగతం" అని శ్రీభరత్ అన్నారు.

పోలవరం, అమరావతి చంద్రబాబు కలలు: పట్టాభిరామ్

విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్ మాట్లాడుతూ పోలవరం, అమరావతి ప్రాజెక్టులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం, అమరావతి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం, అవరోధాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. వాటిని పూర్తి చేయాలన్నది చంద్రబాబు నాయుడు సంకల్పమని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వ హయాంలో ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖపట్నంలో రైల్వే జోన్ నుంచి డేటా సెంటర్ల వరకు అనేక కీలక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని పట్టాభిరామ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖ టీడీపీ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, మాజీ కార్పొ రేటర్ హనూక్, ఉత్తర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై గ్రామసభ



**గూడెంకొత్తవీధి:పెన్ పవర్, సెప్టెంబర్ 03:**మండలంలో సంకాడ స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ ఓటర్ల జాబితా సవరణపై గ్రామసభ నిర్వహించారు. ప్రత్యేక అధికారి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన సభలో ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పిదాలు ఉన్నాయని, వార్డుల వారీగా ఓటర్లను క్రమబద్ధీకరించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ తప్పులను సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, మాజీ ఎంపీటీసీ మొట్టడం లక్ష్మణ్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కాకూరు చిన్న శివ కేశవ, పేసా కార్యదర్శి ఊలం బాబురావు, గ్రామ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సామాజిక కార్యకర్త సుజాత సల్మాన్

- **నడవలేని చిన్నారికి అండగా నిలిచి విశాఖ కే జి హెచ్ కు తరలింపు.**
- **వైద్య ఖర్చుల బాధ్యత తీసుకున్న సుజాత సల్మాన్**



**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 3:**అపదలో ఉన్న ఓ నిరుపేద గిరిజన కుటుంబానికి అండగా నిలిచి, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించేందుకు చొరవ తీసుకున్న సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ మానవత్వాన్ని చాటుకున్నారు.డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ సోబూరు గ్రామానికి చెందిన గడ్డంగి పురుషోత్తం కుమార్తె గీతాంజలి అదే గ్రామంలో 4వ తరగతి చదువుతోంది. గత రెండు వారాలుగా తీవ్ర అనారోగ్యంతో నడవలేని పరిస్థితికి చేరుకోవడంతో పాటు కాళ్లు, చేతులు సరిగా పనిచేయకపోవడంతో తల్లిదండ్రులు ఆమెను అరకు ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.

పరీక్షించిన వైద్యులు పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే విశాఖపట్నం కే జి హెచ్ కు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అయితే అమాయకులైన తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో కే జి హెచ్ లో అవసరమైన పరీక్షలు, వైద్య ఖర్చులు భరించలేమనే భయంతో చిన్నారిని ఇంటికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త సుజాత సల్మాన్, ఈరోజు అరకు ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సమయంలో కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు తమ స్వచంద సంస్థ ద్వారా అవసరమైన సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

అంతేకాకుండా తక్షణ ఖర్చుల కోసం రూ.5,000 నగదును అందించి, అవసరమైన ఏర్పాట్లు చేసి, చిన్నారిని అంబులెన్స్ ద్వారా విశాఖపట్నం కేజీహెచ్ కు తరలించేలా చర్యలు తీసుకున్నారు. వైద్యానికి అవసరమైన సహాయాన్ని కూడా తమ ఎన్జీవో ద్వారా అందిస్తామని కుటుంబానికి హామీ ఇచ్చారు.

చిన్నారి పరిస్థితి గురించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు అనుమానించడంతో కాళ్లు, చేతులు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. అయితే తుది నిర్ధారణ, చికిత్సా విధానం కేజిహెచ్ వైద్యుల పరీక్షలు మరియు వైద్య నివేదికల ఆధారంగా స్పష్టమవుతుంది. కుటుంబ సభ్యులకు బంధువులా అండగా నిలిచి, ఆర్థిక ఇబ్బందులను పట్టించుకోకుండా చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సుజాత సల్మాన్ తీసుకున్న చొరవ అక్కడున్న వారి హృదయాలను కదిలించింది.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం. గీతాంజలికి మెరుగైన వైద్యం అందే వరకు మా ఎన్జీవో తరపున అవసరమైన సహాయం అందిస్తాం" అని సుజాత సల్మాన్ తెలిపారు.

## వరిష్ఠ పౌరుల సమాఖ్య సేవలు అభినందనీయం:సౌత్ ఏసీపీ



**గాజువాక: పెన్ పవర్ సెప్టెంబర్ 03:**వరిష్ట పౌరుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు కొనియాడారు.సమాఖ్య పదో వార్షికోత్సవం సందర్భంగా గాజువాక క్లబ్ ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 65 ఏళ్లు పైబడిన వైద్యులను ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వయోభారం లెక్కచేయకుండా సమాజ సేవలో వరిష్ట పౌరుల సమాఖ్య ముందుండటం స్ఫూర్తిదాయకమన్నారు.వరిష్ట పౌరుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్యం,సామాజిక భద్రత, ఆత్మీయత, సమస్యల పరిష్కారానికి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు.సమాజ అభివృద్ధిలో వృద్ధుల అనుభవం, సూచనలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.65 ఏళ్లు దాటినప్పటికీ వైద్య రంగంలో తమ అనుభవాన్ని కొనసాగిస్తూ ప్రజలకు సేవలందించిన వైద్యులను సత్కరించడం ద్వారా వారి సేవలను గౌరవించడం అభినందనీయమన్నారు.ఇలాంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు

పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వృద్ధులందరినీ ఒకే వేదికపైకి తీసుకు రావటం గొప్ప విషయం అని పేర్కొన్నారు.సమాఖ్య చైర్మన్ ఎస్వి రమణరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంకటరావు,టివి నాగేశ్వరరావు,లక్ష్మణరావు,ఎస్వీ సుబ్బారావు,ఏజె స్టాలిన్,గాజువాక క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ,కార్యదర్శి కృష్ణ కుమార్,కోశాధికారి సిహెచ్ జీవన్ బాబు,ప్రముఖ వైద్యులు ఆర్కే కృష్ణమూర్తి,ధనలత,వీరభద్రరావు,తలసిల ప్రసాద్,హేమలత,ప్రకృతి ఒడి సంస్థ ప్రతినిధి ఐశ్వర్య,లయన్స్ క్లబ్,గాజువాక క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 90 శాతం సబ్సిడీపై రైతులకు రాజ్‌మా విత్తనాల పంపిణీ



దామనాపల్లి సచివాలయంలో కార్యక్రమం

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 3:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి సచివాలయంలో రైతులకు 90 శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. పంచాయతీ వ్యవసాయ సహాయకురాలు ఉష ఆధ్వర్యంలో పీసా, కూటమి నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీపై రాజ్‌మా విత్తనాలను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకుని రాజ్‌మా సాగును ప్రోత్సహించాలని నాయకులు సూచించారు.కార్యక్రమంలో పీసా గ్రామ కమిటీ సభ్యులు మాదిరి చంటిబాబు, రాధాకృష్ణ, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, కూటమి నాయకులు ఎం. సతీష్, మూర్తి, బొజ్జన్న, ఇతర కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

## పిఎం జన్మన్ లబ్ధిదారులకు తప్పని తిప్పలు.

**బిల్లుల చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యం**



**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 3:** అరకులోయ మండల పరిధిలోగల పిఎం జన్మన్ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు విషయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు బిజెపి నాయకులు ఆరోపించారు. ఈ విషయమై మాట్లాడుతూ ఇంటింటా బిజెపి కార్యక్రమంలో భాగంగా బిజెపి నాయకులు ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు పీఎం జన్మన్ లబ్ధిదారులు గత 6నెలల నుండి బిల్లులు చెల్లింపు ఆపేసారని అలాగే పలుమార్లు ఎకౌంటు,ఆధార్ అప్డేట్లు చేయాలని ఆఫీసు చుట్టూ తిప్పుతున్నారని తెలిపినట్టు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వెనుకబడిన తరగతులైన పి.వి.టి.జి.లకు అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఇన్ని నెలల నుండి బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని బిజెపి నాయకుడు రామచందర్ అన్నారు. ఈ పథకానికి గడువు ముగుస్తుండడంతో లబ్ధిదారులు ప్రభుత్వమిచ్చిన నిధులతో పాటు తమ వద్ద ఉన్న బంగారం,పొలాలు తాకట్టు పెట్టి ఇల్లు నిర్మించుకుంటుంటే ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకాలను నిర్లక్ష్యం చేసిన అలాగే లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులో మరియు కార్యాలయం చుట్టూ వివిధ కారణాలతోతిప్పుతూ ఇబ్బంది పెట్టిన గృహనిర్మాణ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ మంత్రివర్యులు వారికి అలాగే జిల్లా కలెక్టర్ వారికి తెలియజేస్తామని అన్నారు.

## ముస్సిపాలిటీలో ముసలాన్ని తొలగించాలి.

- **అధికారుల కాళీ పోస్టులు భర్తీ చేయాలి**
- **తాగునీరు,పారిశుధ్యం, వీధిలైట్లు,రోడ్లు,కాలువలు సమస్యలు పరిష్కరించాలి.**
- **పారిశుద్ధ్య సిబ్బందికి ఏప్రాన్లు,సబ్బులు, శ్రీబట్టలు,నూనెలు ఇవ్వాలి.**
- **ప్రత్యేక అధికారికి కాంగ్రెస్ పార్టీ నాయకుల వినతి**

**పార్వతీపురం సెప్టెంబర్ 03 పెన్ పవర్.** పార్వతీపురం మున్సిపాలిటీలో ముసుగు దన్నిన ముసలాన్ని తొలగించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ డిసిసి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు,ఓ.బి.సి చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్,ఏవో గంట మోహన్ రావు తదితరులు పార్వతీపురం మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా నియమింపబడిన పార్వతీపురం ఆర్డీవో కే.మాధురికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయం ఏవో సిహెచ్ రాజేశ్వరి ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పార్వతీపురం మున్సిపాలిటీ పాలన పడకేసిందన్నారు.కీలకమైన మున్సిపల్ కమిషనర్,మేనేజర్,రెవెన్యూ ఆఫీసర్,డిఈఈ,ఏ ఈఈ తదితర కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.దీంతో ప్రజా పాలన స్తంభించిందన్నారు.తక్షణమే ఆయా పోస్టులను భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు.ప్రజలను వేధిస్తున్న తాగునీరు,విద్యుత్తు,పారిశుద్ధ్యం,రోడ్లు,కాలువలు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు.మున్సిపల్ కార్యాలయం ముందున్న రోడ్డు గోతుల మయము అయిందన్నారు.తగినంత మంది పారిశుద్ధ్య సిబ్బంది లేక,పుష్ కార్టులు లేక పారిశుద్ధ్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.గత రెండేళ్లుగా వారికి ఇవ్వాల్సిన యాప్రాన్లు,సబ్బులు,నూనెలు,బట్టలు,గ్లౌజులు తదితరవి అందజేయాలన్నారు.రాత్రిపూట విధులు నిర్వహించే పారిశుద్ధ్య సిబ్బంది యాప్రాన్లు ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.మెయిన్ రోడ్డుతో పాటు పలు వీధుల్లో వీధి దీపాలు లేక ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు చీకటిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు.స్వచ్ఛమైన తాగునీటిని అందజేయాలన్నారు.అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి,పుష్ కార్టులు కొనుగోలు చేసి 24/7 శానిటేషన్ అందించాలన్నారు.మున్సిపాలిటీలో ప్రభుత్వ ఆస్తులను రక్షించాలన్నారు.దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.



## మారుమూల గ్రామాల్లో అభివృద్ధి...

## కూటమి ప్రభుత్వ చలవే...



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 3 :** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రహదార్లు ఇతర అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చలవే అని అంతాడ పంచాయితీ టీడీపీ యూనిట్ ఇంచార్జి సుంకరి బాలకృష్ణ అన్నారు. పాడేరు నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి మరియు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మండల టీడీపీ అధ్యక్షులు, కాకూరి చందర్రావు,ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం అంతాడ పంచాయితీ మునసలి లో యూనిటీ ఇంచార్జి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటా టీడీపీ రెండేళ్ల పాలన పై ముమ్మరంగా ప్రచారం చేశారు. కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించే పథకాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు అడిగి అధికార్లు దృష్టికి, ఇంచార్జి గిడ్డి ఈశ్వరి కి తెలియజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి , అంతాడ గ్రామల నుంచి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.?

## గింజర్తిలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన.

సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు వెల్లడి.



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 3 :** నిత్యం ప్రజలు సామాజికంగా ఏదురుకునే పలు సామాజిక అంశాలపై ఏ విధంగా వాటిపై స్థానికంగా పరిష్కరించుకోవాలో అనే విషయాపై సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఇక్కడ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు. కొయ్యూరు మండలం గింజర్తిలో గురువారం రాత్రి గ్రామస్తులతో సమావేశం అయి పలు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే చెడుపరిణామాలు,మహిళలపై నేరాల నివారణ, బాల్య వివాహాల నిరోధం,సైబర్ నేరాల పట్ల అప్రమత్తత,రహదారి భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వివాహేతర సంబంధాల వల్ల కుటుంబాల్లో ఏర్పడే గొడవలు దాడులు , కొన్ని సందర్భాల్లో హత్యలకు దారితీసే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన చేశారు.ఈ కార్యక్రమంలో నేరాల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలోఎస్ఐకిషోర్వర్మ ఏపీఎస్పీపోలీసులు.గ్రామస్తులు,మహిళలు పాల్గొన్నారు.

# గిరిజన రైతుల పట్టా భూముల వివాదంపై ఆర్డీవో విచారణ.



- నాలుగు రోజులు గడువు కోరిన అటవీశాఖ అధికారులు.
- రైతులు అధైర్యపడవద్దు.
- ఆర్డీవో భుజంగరావు.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 3.** చింతపల్లి మండల పరిధిలోని కందుల గాది, చిన్నగెడ్డ గ్రామాలకు చెందిన గిరిజన రైతుల పట్టా భూముల్లో అటవీ శాఖ అధికారుల జోక్యంపై నెలకొన్న వివాదం కీలక మలుపు తిరిగింది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ జిరాయితీ పట్టా భూములను అటవీ భూములుగా పేర్కొంటూ అధికారులు సర్వే రాళ్లు వేయడంపై ఇరు గ్రామాలకు చెందిన సుమారు 35 మంది రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆర్డీవో, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఎం. భుజంగరావు కందులగాది, చిన్నగడ్డ గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి సమగ్ర విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ డివిజనల్ అధికారి వై.వి. నరసింహారావు, స్థానిక తహసీల్దార్ హనుమంతు త్రివేణి, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ అలాగే ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి మోహన్‌రావుతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ?విచారణ సందర్భంగా స్థానిక గిరిజన రైతులు ఆర్డీవో ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తూ, తమ పూర్వీకుల నాటి వారసత్వ పట్టా భూములను అటవీశాఖ అక్రమంగా ఆక్రమించాలని చూస్తోందని వాపోయారు. సర్వే రాళ్లు తొలగించినందుకు తమపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, తమ సాగు భూములను తమకే దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ?అయితే ఇప్పటివరకు నిర్వహించిన విచారణలో క్షేత్రస్థాయి రికార్డులన్నీ పూర్తిగా రెవెన్యూ పట్టాలకు అనుకూలంగానే ఉన్నాయని తేలింది. అటవీ అధికారులు మాత్రం సదరు భూమి తమదేనని వాదిస్తున్నప్పటికీ, అందుకు తగ్గ ఆధారాలను లేదా పూర్తిస్థాయి రికార్డులను సమర్పించలేకపోయారు. తమ వద్ద ఉన్న పత్రాలను సరిచూసి సమగ్రంగా వివరణ ఇచ్చేందుకు అటవీ శాఖ అధికారులు మరో నాలుగు రోజుల సమయం కోరారు. ?ఈ సందర్భంగా ఆర్డీవో భుజంగరావు మాట్లాడుతూ, రైతులెవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, ప్రాథమికంగా పరిశీలిస్తే రికార్డులన్నీ గిరిజనుల పట్టా భూములకే స్పష్టంగా అనుకూలంగా ఉన్నాయని, మీ పట్టా భూములు మీకే ఉంటాయని హామీ ఇచ్చారు. అటవీ శాఖ కోరిన నాలుగు రోజుల గడువు ముగిసిన వెంటనే పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. దీంతో మరో నాలుగు రోజుల్లో ఈ వివాదాస్పద భూములపై పూర్తి స్థాయి స్పష్టత రానుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోక్సో చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

ముంచంగిపుట్టు ఎస్సై పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 03.** మండలంలోని జర్జుల పంచాయతీ, అంబపడ గ్రామంలో ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని ఆధ్వర్యంలో ప్రజలకు పోక్సో చట్టాలు, సైబర్ నేరాలపై, రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు, నాటుసారా గంజాయి వల్ల కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిరోధక చట్టం, మహిళల భద్రత, పోక్సోచట్టంతో పాటు ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సైబర్ నేరాల పట్ల గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు పాల్పడితే తక్షణమే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, గ్రామస్తులు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 150మంది గిరిజన రైతులకు రాజ్మా విత్తనాలు పంపిణీ



- జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర చేతులు మీదుగా పంపిణీ.
- రైతు సేవా కేంద్రాలలో రాజ్మా విత్తనాలు ప్రతి రైతు తీసుకోవాలి.
- మండల వ్యవసాయ శాఖ అధికారి జీ మురళికృష్ణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 03.** మండలంలో రబీసాగు చేసే గిరిజన రైతులు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న రాజ్మా విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ అరబీరు సుభద్ర అన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారి జి మురళి కృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వం 90 శాతం రాయితీపై 150మంది రైతులకి పంపిణీ చేస్తున్న రాజ్మా విత్తనాలు జిల్లా చైర్పర్సన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతు రబీ సీజన్ దృష్టిలో పెట్టుకొని రాజ్మా విత్తనాలు సాగు చేసి మంచి లాభాలు పొందాలని ఆమె సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ.. మండలం లో 18 రైతు సేవ కేంద్రాల్లో 267 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలను రైతులకి 90 శాతం రాయితీ పైశుక్రవారం నుంచి పంపిణీ చేస్తున్నమని ఆయన అన్నారు. రాజ్మా విత్తనాలు తీసుకునే రైతు తన ఆధార్ కార్డు తీసుకు వెళ్తే సరిపోతుందని ఆయన అన్నారు. ఆ రైతు సేవ కేంద్రాల పరిధిలో ఆన్ లైన్ చేసి మాత్రమే పంపిణీ చేస్తారన్నారు. పంట వేసుకునే ప్రతి రైతుకి రాజ్మా విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యసమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షుడు ఏం ఏం శ్రీను, రాజారావుతో పాటు రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నాటు సారాయితో ఒక మహిళ అరెస్టు .



**కురుపాం సెప్టెంబర్ 03 పెన్ పవర్.** నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధి ప్రొహిబిషన్ డ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జియమ్మ వలస మండలం చినమేరంగి గ్రామ సమీపంలో గురువారం నాడు దాడులు నిర్వహించరు. ఈ మేరకు ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చిన్న మేరంగి గ్రామ సమీపంలో నాటు సారా విక్రయించుచున్న అదే గ్రామానికి చెందిన మీసాల విజయమ్మ ను 05 లీటర్ల నాటుసారా తో అరెస్టు చేసి న్యాయ స్థానం నందు హాజరు పరచగా ఆమెకు న్యాయ స్థానం 14 రోజులు రిమాండ్ ను విధించిందన్నారు. నాటు సారాయి రవాణా, తయారీ, విక్రయాలపై నిఘా పెడుతున్నామని, ఎవరైనా వీటికి అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే ప్రజలు నాటు సారాయి విక్రయాలపై సమాచారం ఇచ్చి మాకు సహకరించాలని. కురుపాం ఎక్సైజ్ ఆఫీస్ నంబర్ 6302936599 కు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి నీ గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో కురుపాం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నరు.

## ఇచ్చాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం. సెప్టెంబర్ 03 :** కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. శుక్రవారం నాడు కవిటి మండలం ప్రగడపుట్టుగలో జరిగే కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనున్నారు. శుక్రవారం నాడు పూర్తిగా ఇచ్చాపురం నియోజకవర్గంలోనే పర్యటించనున్న రామ్మోహన్ నాయుడు.. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తో కలసి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఎంపి కప్ 2026, కృష్ణాష్టమి వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. తొలుత ఉదయం 9 గంటలకు కంచిలి మండలం పోలేరులో బిటి రోడ్డు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం కంచిలి మండలం గుండం గ్రామంలో తెలుగుదేశం పార్టీ లోకి పలువురు చేరికలు అయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొంటారు. ఇచ్చాపురం రాజా వారి మైదానంలో 2.29కోట్ల కోల్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో నిర్మించనున్న బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇచ్చాపురం మున్సిపాల్టీ పరిధిలో రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం భైరిపురం, రాజాపురం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి కవిటి మండలం ప్రగడపుట్టుగలో జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు, ఎంపి కప్ 2026 లో భాగంగా ఉట్టి కొట్టే పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రామ్మోహన్ నాయుడు భాగస్వామ్యం అవుతారు.

## నైరా కళాశాల డీన్‌గా డాక్టర్ డి. చిన్నంనాయుడు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం సెప్టెంబర్ 3 :** నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డా. డి. చిన్నంనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1989లో కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థిగా వ్యవసాయ విద్యను ఆయన అభ్యసించారు. అనంతరం అదే కళాశాలలో వ్యవసాయ విస్తరణ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. అమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లోనూ పనిచేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గవరంపేటకు చెందిన డా. చిన్నంనాయుడు అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను విద్యాభ్యాసం చేసిన కళాశాలలోనే అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేసేందుకు ప్రాధాన్యం ఇస్తానన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కురుపాం ఎమ్మెల్యే.



**గుమ్మలక్ష్మీపురం సెప్టెంబర్.03 పెన్ పవర్.** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం కొమరాడ మండలంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే శతోయక జగదీశ్వరి. గురువారం నాడు పరామర్శించారు. దళాయిపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ధనుకొండ గణపతినాయుడు, 207వ బూత్ ఇన్‌చార్జ్ పిన్నింటి లక్ష్మునాయుడు, శ్రీష్టు రాహుల్, బెల్లాన అశోక్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వగృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా కొందులగుంప గ్రామానికి చెందిన వాన బుజ్జి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే గారు పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కె. రమేష్ పై ఇటీవల వేటకోడవలితో దాడి జరగడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున, వ్యక్తిగతంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు, నంగిరెడ్డి మధుసూదన్ రావు, గౌరిశంకర్, రాఘవ, రాము, బలరాం, త్రినాధం, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

## రామాలయం పునర్నిర్మాణానికి కర్రీ శ్రీకాంత్ విరాళం

**గాజువాక: పెన్ పవర్, సెప్టెంబర్ 03 :** డ్రైవర్స్ కాలనీ రామాలయం పునర్నిర్మాణానికి జనసేన పార్టీ నాయుకుడు కర్రీ శ్రీకాంత్ దంపతులు లక్ష రూపాయిలు విరాళం ఆలయ ఈ ఓ పద్మావతికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో తాము కూడా భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 72వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి శంకర్రావు పాల్గొన్నారు.



# శ్రీ గీతంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





✹ కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి.. ఉట్టి కొట్టి ఉత్సాహం

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 03:**గండేపల్లి శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

కార్యక్రమంలో శ్రీ గీతం కరస్పాండెంట్ వి.ఎస్.పీ. చౌదరి మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. కులమతాలకు అతీతంగా పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం తమ పాఠశాల లక్ష్యమన్నారు.

విద్యార్థులు చక్కని వేషధారణలతో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారని, ఇందుకోసం తల్లిదండ్రులు ఎంతో శ్రమించి పిల్లలను సిద్ధం చేసి పంపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పండుగను విద్యార్థులకు పరిచయం చేస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు శ్రీ గీతం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న విద్యార్థులు ఉట్టి కొట్టి సందడి చేయడంతో వేడుకలు మరింత ఉత్సాహభరితంగా సాగాయి. విద్యార్థుల కేరింతలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** జగ్గంపేట టౌన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 10 మందికి రూ.7,84,639 విలువైన చెక్కులను గురువారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ మోటారు బైక్ పై ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు వరంగా మారాయన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో జ్యోతుల నెహ్రూ కులం, మతం, పార్టీల భేదాలు లేకుండా అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పేరుకే పరిమితమైందని, పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవతో సీఎం సహాయనిధి ద్వారా నేరుగా లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, ఎస్ ఏ గఫూర్, రాయి సాయి, పీలా మహేష్, వైబోగుల కొండబాబు యాదవ్, నేదూరి గణేష్, దుర్గపు ప్రకాష్, సాంబతుల చంద్రశేఖర్, నలమాటి ఆనంద్, చెలికాని హరి గోపాల్, ఎండి కాజా, దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట శ్రీ ప్రజ్ఞలో అంబరాన్నంటిన కృష్ణ జన్మాష్టమి సంబరాలు




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 03:** జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో క్యాంపస్ మొత్తం బృందావనంలా మారిపోయింది. వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో స్టేజ్ పై సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణాష్టమి శ్లోకాలు ఆలపించి అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు నాగబాబు మాట్లాడుతూ చిన్నారులలో చిన్నతనం నుండే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని, పుస్తకాల చదువుతో పాటు సంస్కృతిని కూడా నేర్పిస్తేనే పరిపూర్ణ విద్యార్థులుగా తీర్చిదిద్దగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపల్ కే అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యకు ఐడీపీతో ఆదిత్య యూనివర్సిటీ ఒప్పందం

✹ విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్, ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 03:**గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఐఈఎల్‌టీఎస్ శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు ఐడీపీ ఎడ్యుకేషన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో–ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో లి‘ఐఈఎల్‌టీఎస్––విదేశీ ఉన్నత విద్య’లిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఈఎల్‌టీఎస్ పరీక్ష విధానం, సన్నద్ధత, అవసరమైన స్కోర్లు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, విదేశాల్లో ఉన్నత విద్యతో పాటు కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా డా. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచస్థాయి విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలతో పాటు ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఐడీపీ ఎడ్యుకేషన్‌తో కుదిరిన భాగస్వామ్యం ద్వారా ఐఈఎల్‌టీఎస్‌తో పాటు విదేశీ విద్యకు సంబంధించిన మరిన్ని అవకాశాలు, నిపుణుల మార్గదర్శకత్వం విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

ఐడీపీ ఎడ్యుకేషన్––ఆంధ్రప్రదేశ్ ఐఈఎల్‌టీఎస్ కార్యకలాపాలు, వ్యాపార అభివృద్ధి ప్రతినిధి యష్ శర్మ విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్ పరీక్ష, సన్నద్ధత, విదేశీ విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

కార్యక్రమంలో ప్రో వైస్–ఛాన్సలర్ (అకడమిక్స్) డా. రమాశ్రీ, ప్రో వైస్–ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్స్) డా. ఏ. రమేష్, డీన్––కెరీర్ డెవలప్‌మెంట్ డా. సంజీవ్‌రావు, డీన్––ఇంటర్నేషనల్ రిలేషన్స్ డా. రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ జన్మదినవేడుకలు





**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 03**:మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ గారి జన్మదిన వేడుకలు మండల అధ్యక్షులు కురస ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. సందర్భంగా స్థానిక పద్మాజీ గ్రాండ్ హోటల్ లో స్థానిక ఎమ్మెల్యే గారు గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భారీకేక్ కట్ చేసినారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమర్ జన్మదిన సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీచేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల బలరామూర్తి, పి గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి కృష్ణసుందర్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, బిజెపి జిల్లా కార్యదర్శి దంతులూరి రామా వర్మ, కముజు శ్రీను, బిజెపి మండల జనసేన మండల అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, మైపాల తాతాజీ, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి అంతర్వేది దేవి, బిజెపి మండల ఉపాధ్యక్షులు చప్పిడి వెంకటేశ్వరరావు, అయ్యగారి శ్రీను, పేరాబత్తుల సుబ్బారావు అప్పన గణపతి, దొమ్మేటి ప్రసాద్, శ్రీకాకుళం పవన్, రాగిరెడ్డి సాయిరాం, గోనే మడతల కనకరాజు, బక్క శ్రీహరి, గుత్తుల సత్యనారాయణ, నాయకులు నాగాబత్తుల సుబ్బారావు పేరాబత్తుల సుబ్బరాజు, కాగితపల్లి సాయిరాం, అధికారి బాబ్జి, యర్రంశెట్టి వీరభద్రరావు, కొప్పిరెడ్డి ఈశ్వరరావు, వంగా చిన్న, జయను పరాంకుశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో అఖిల్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 03:**

కాకినాడ జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడు అఖిల్ విద్యాసంస్థల్లో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అఖిల్ విద్యాసంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించగా,ఉట్టి కొట్టే సన్నివేశాన్ని విద్యార్థులు ఉత్సాహంగా ప్రదర్శించారు.చిన్నారుల వేషధారణలు,సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఇనకోటి గంగాధర్ చిన్నారులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు.భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు,పండుగల ప్రాధాన్యతను చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో సాంస్కృతిక చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు.వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులకు,విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన గురువులకు అభినందనలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**మండల పరిధిలోని 123,122 బూత్ లలో“రెండేళ్ల నమ్మకం –– అభివృద్ధి సంక్షేమం” కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలుతెలియజేసారు . గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి శ్యామ్ గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పోరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, దొమ్మేటి రామారావు, యూనిట్ ఇంచార్జ్ యాగన రాము , కో యూనిట్ ఇంచార్జ్ బచ్చు చినబాబు,, మంద రాజేష్, బూత్ కన్వీనర్ ముష్టి వెంకట రాజేశ్వర్ శర్మ, దుర్గా శీను, కొప్పినీడి ఈశ్వరరావు, పితాని ఈశ్వరరావు, దొమ్మేటి శ్రీహరి, పితాని ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ నాయకులు,ప్రభుత్వ అధికారులు కలిసి పేదల పొట్ట కొట్టొద్దు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** జగ్గంపేట మండలం జటాద్రి కొండ సర్వేనెంబర్ 24లో గత నలభై సంవత్సరాల నుంచి భూమిలేని నిరుపేద రైతులు మామిడి, జీడి మామిడి వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ చెట్లను రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా టిడ్కో కంపెనీ వారికి సోలార్ సిస్టం పెట్టుకోవడానికి పేద రైతులు పండించిన పంటను జెసిబిలతో నరికి వేయడం సరైన పద్ధతి కాదని గురువారం పేద రైతులతో కలిసి ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు జగ్గంపేట తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడా కంపెనీలకు కూటమి ప్రభుత్వ నాయకులు, రెవెన్యూ అధికారులు తొత్తులుగా మారి పేదల పొట్ట కొడుతూన్నారని,వారి బ్రతుకులను రోడ్డున పడేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇలాంటి విషయాల్లో రెవిన్యూ అధికారులు కాకుండా పోలీస్ అధికారులు రావడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రైతులపై పోలీసు వారు చేసిన పనికి మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు.తక్షణమే పేదల భూముల్లో పనులను ఆపాలని, ప్రోక్లైన్లను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పట్ల, కూలీల పట్ల, పేద ప్రజల పట్ల అన్నివేళలా వారికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు గ్రామ నాయకులు నకిరెడ్డి నాగేశ్వరరావు, పెద్దకాపు, రైతులు నూకరాజు, శ్రీనివాసరావు, నాని బాబు, నాగేంద్ర, గంగరాజు, ధర్మరాజు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com